

భక్తి శ్రద్ధలతో ఏకాదశి వేడుకలు

ధర్మపురి: ఆషాఢశుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో మూలవిరాట్‌లకు అభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉపప్రధాన అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసాచారి ఏకాదశి విశిష్టతను వివరించారు.





స్వామివారి కోటి తులసీదళ అర్చనలో పాల్గొన్న భక్తులు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మల్యాల: మండలంలోని లంబాడిపల్లి శ్రీపద్మావతి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, కోటి తులసీ దళ పత్రాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మరాటి సత్తయ్య, అర్చకులు విజయ్, ఆశిష్ శుక్లా, భక్తులు పాల్గొన్నారు.



రాయికల్ లో గోరింటాకుతో మహిళలు

గోరింటాకు వేడుకలు

రాయికల్: పట్టణంలోని కేశవనగర్‌లోని పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. గోరింటాకు విశిష్టత గురించి వివరించారు. కౌన్సిలర్లు ఎలిగేటి లతిక, మహిళలు ఎలిగేటి షర్మిల, గంట్యాల లక్ష్మి, బొమ్మకంటి పద్మ, ఆడెపు రమ, అధ్యక్షుడు ఎలిగేటి సతీశ్, గంట్యాల ప్రవీణ్, మామిడాల మహేశ్, బొమ్మకంటి నాగరాజు, ఎలిగేటి అనిల్ పాల్గొన్నారు.

చివరి దశకు సదర్‌మాట్ బ్యారేజీ

నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోని 20వేల ఎకరాల ఆయకట్టును సాగులోకి తెచ్చేందుకు ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ వద్ద గోదావరిపై నిర్మించిన సదర్‌మాట్ ప్రాజెక్టు పనులు పూర్తి దశకు చేరాయి. 1.58 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు సాగునీటిని అందించడంతోపాటు రెండు జిల్లాల వారధిగానూ మారనుంది.



మూలరాంపూర్ శివారులో పూర్తయిన సదర్‌మాట్ బ్యారేజీ కం బ్రిడ్జి

ప్రాజెక్ట్ రిపోర్ట్

- 95 శాతం మేర పనులు పూర్తి
- ఇప్పటికే బిగించిన 54 గేట్లు
- ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం
- రెండు జిల్లాలకు తగ్గనున్న దూరభారం

ఇబ్రహీంపట్నం: గోదావరి నీటిని సద్వినియోగం చేసుకోవాలన్న సదుద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్, నిర్మల్ జిల్లా పొన్కల్‌ను కలుపుతూ.. మూలరాంపూర్ వద్ద బ్యారేజీ కమ్ బ్రిడ్జి నిర్మాణానికి 2016లో రూ.516 కోట్లతో శ్రీకారం చుట్టింది. 1.58 టీఎంసీల నీటి సామర్థ్యంతో.. జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లోని సుమారు 20వేల ఎకరాల ఆయకట్టుకు సస్యశ్యామలం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 2017లో అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ టెండరు దక్కించుకుంది. మొదట పనులు నత్తనడకన సాగాయి. ఈ క్రమంలో బృందశ్రీ కంపెనీ సబ్ కాంట్రాక్టు తీసుకుని పనులను వేగవంతంగా చేసింది. ఇప్పటివరకు 95 శాతం మేర పనులు పూర్తయ్యాయి.

పెరగనున్న భూగర్భజలాలు

సదర్‌మాట్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోని 20వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇప్పటికే సదర్‌మాట్ కింద 15వేల ఎకరాలకు నీరు అందుతుండగా.. గంగనాల ప్రాజెక్టులోకి కూడా నీటిని పంపించి మరో మరో 5వేల ఎకరాలకు నీరు అందించనున్నారు. ప్రాజెక్టులో సుమారు 17 కిలోమీటర్ల మేర (ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్ వరకు) ఎప్పుడూ నిల్వ ఉండనున్నాయి. ప్రాజెక్టు క్రింద భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఇప్పటికే రూ.80 కోట్ల పరిహారం చెల్లించింది.

తగ్గనున్న దూరభారం

అటు నిర్మల్, ఇటు జగిత్యాల మధ్య బ్యారేజీ నిర్మించడంతో రెండు జిల్లాలకు దూరం తక్కువ కానుంది. రాకపోకలు పెరగనున్నాయి. నిర్మల్ జిల్లాలోని పొన్కల్ వెళ్లేందుకు ప్రస్తుతం 40 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. బ్రిడ్జి మీదుగా వెళ్తే కేవలం 10కిలోమీటర్లే దూరం ఉంటుంది.



బ్యారేజీ వద్ద రోడ్డు నిర్మాణం

సదర్‌మాట్ ప్రాజెక్టు వివరాలు

సామర్థ్యం	1.58 టీఎంసీలు
పనులు ప్రారంభం	2017
ఆయకట్టు	20 వేల ఎకరాలు
వ్యయం	రూ.676 కోట్లు

ప్రారంభానికి సిద్ధం

బ్యారేజీ కం బ్రిడ్జి పనులు 95శాతం పూర్తయ్యాయి. ఇప్పటికే 54 గేట్లు బిగించారు. ప్రాజెక్టును అనుకుని బ్రిడ్జి పనులు కూడా పూర్తయ్యాయి. రోడ్డు పనులు వేగవంతం చేస్తున్నారు. గేట్లను ఎత్తేందుకు అవసరమైన విద్యుత్ కోసం ప్రత్యేక సబ్‌స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. గేట్లకు బిగించిన మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

పనులు వేగవంతం

95 శాతం పనులు పూర్తయ్యాయి. గేట్లు ఎత్తేందుకు మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేసేందుకు సిద్ధం చేస్తున్నాం. బ్రిడ్జిపై నుంచి వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఇరువైపులా రోడ్డు పనులు చేపడుతున్నాం.

– లక్ష్మి ఇన్‌చార్జి ఈఈ, సదర్‌మాట్ బ్యారేజీ

రైతులకు లాభం



సదర్‌మాట్ బ్యారేజీ కం బ్రిడ్జితో గంగనాల ప్రాజెక్టులోకి నీరు చేరనుంది. తద్వారా ఆయకట్టు రైతులకు మేలు చేకూరనుంది. గంగనాల ప్రాజెక్టు కింద వేలాది ఎకరాల్లో ఏటా రెండు పంటలు పండించుకునే అవకాశం ఏర్పడింది.

– గుమ్మల చిన్న భూమన్న, రైతు, వేములకుర్తి

భూగర్భ జలాలు పెరుగుతాయి



ప్రాజెక్టుతో సుమారు 17 కిలోమీటర్ల మేర బ్యాక్ వాటర్ ఉంటుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. బోర్లు, బావుల్లో నీటి నిల్వలు ఉంటాయి. ప్రాజెక్టును త్వరగా ప్రారంభించాలి. బ్యారేజీతో రైతులు, మత్స్య కార్మికులకూ లాభం.

– రాధారపు దేవదాస్, రైతు, వేములకుర్తి

మొహర్రం వేడుకలు



ఇబ్రహీంపట్నంలో పీరీల ఊరేగింపు

రాయికల్/ఇబ్రహీంపట్నం: జిల్లాలో మొహర్రంను హిందూ ముస్లిం తేడా లేకుండా ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో పీరీలను ఊరేగించారు. రాయికల్, కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్‌లో కొందరు పులి వేషధారణతో సందడి చేశారు.



రాయికల్‌లో పులివేషాలతో..

బల్దియా వర్సెస్ వ్యాపారులు

- షాపుల బోర్డులు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది
- అభ్యంతరం తెలుపుతున్న షాపుల యజమానులు
- రోడ్లు విస్తరించాకే చర్యలు తీసుకోవాలంటున్న వైనం

సాక్షి ప్రత్యేక కథనం



బోర్డులు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జగిత్యాల: జిల్లాకేంద్రంలో రోడ్లకిరువైపులా ఉన్న షాపుల నిర్వాహకులు ఏర్పాటు చేసిన బోర్డులను బల్దియా సిబ్బంది తొలగిస్తున్నారు. దీంతో షాపుల యజమానులు, నిర్వాహకుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ ఆదేశాలా..? ఎమ్మెల్యే చెప్పారా..? ఎమ్మెల్సీ తొలగించమన్నారా..? అంటూ బల్దియా సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారుతోంది. కొద్దిరోజులుగా మున్సిపాలిటీ అధికారులు యావర్ రోడ్‌లో దుకాణ సముదాయాల ముందున్న బోర్డులను తొలగిస్తున్నారు. కొందరు దుకాణాల ముందు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వాటిని బల్దియా సిబ్బంది తొలగిస్తుండడంతో నిర్వాహకులు అభ్యంతరం తెలుపుతున్నారు. ముందుగా రోడ్డు విస్తరణ చేపట్టాలని, లేకుంటే ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. తాము చిన్నపాటి బోర్డులను దుకాణం ముందు పెట్టుకున్నామని, అందరివి తీస్తే తమవి తీయాలని సిబ్బందితో వాగ్వివాదానికి దిగుతున్నారు.

యావర్‌రోడ్డుపైనే చర్యలు

జిల్లాకేంద్రంలో యావర్‌రోడ్‌లోనే బోర్డులను తొలగిస్తున్నారు. మరోవైపు ప్రధాన రోడ్డుగా ఉన్న కొత్త బస్టాండ్, పాతబస్టాండ్, గొల్లపల్లిరోడ్‌లో మాత్రం ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్కడా ఆక్రమణలు తొలగించాలని నిర్వాహకులు అంటున్నారు. జిల్లాకేంద్రంలో ప్రధానంగా యావర్‌రోడ్, గొల్లపల్లి రోడ్, కొత్తబస్టాండ్, పాతబస్టాండ్, టవర్‌సర్కిల్ వంటి రద్దీగల ప్రాంతాల్లోనే ఆక్రమణలు అత్యధికంగా ఉన్నాయి. కొందరు ఏకంగా టేలాలు వేసుకుని కబ్జా చేయగా.. మరికొందరు నిత్యం రోడ్లపైనే తోపుడుబండ్లపై విక్రయాలు చేస్తున్నారు. మరికొందరు రోడ్లపైనే వస్తువులను అమ్ముతున్నారు. వీటిని తొలగిస్తే ప్రజలకు పార్కింగ్ సమస్య ఉండదు. రోడ్డు కూడా వెడల్పుగా ఉంటుంది. అయితే కేవలం యావర్ రోడ్‌లోనే చర్యలు తీసుకుంటుండడంతో బల్దియా అధికారులకు ఆక్రమణాలు కన్పించడం లేదా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గొల్లపల్లి రోడ్‌లో స్పోర్ట్స్ అథారిటీకి చెందిన మినీస్టేడియంను అనుకుని అనేక దుకాణాలు వెలిశాయి. ఇందులో అనేక వ్యాపారాలు చేసుకుంటున్నారు. బల్దియాకు ఎంతోకొంత ఫీజు చెల్లిస్తున్నారు. స్పోర్ట్స్ అథారిటీకి చెందినది కావడంతో బల్దియా సిబ్బంది పట్టించుకోకపోవడంతో మినీస్టేడియం ఆక్రమణకు గురవుతోంది. కొత్తబస్టాండ్ ముందు ఉద్యానవనానికి సంబంధించిన గోడను అనుకుని అనేక దుకాణ సముదాయాలు వెలిశాయి. అక్కడ కూడా వాటిని తొలగించి బల్దియా ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటివి పట్టించుకోకుండా చిన్నచిన్న బోర్డులను తొలగించడంతో విమర్శలకు తావిస్తోంది.

ఆక్రమణలు తొలగిస్తాం



జిల్లాకేంద్రంలోని ఆక్రమణలన్నీ తొలగిస్తాం. రోడ్లకు అడ్డుగా బోర్డులు ఏర్పాటు చేయవద్దు. ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు. అలాంటి వారికి మొదట నోటీసులు జారీ చేస్తాం. అనంతరం పూర్తిగా తొలగిస్తాం. ఎందులో ఎవరికీ మినహాయింపు లేదు.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

- సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాలటౌన్: స్థానికంగా ఉపాధి లేక గల్ఫ్ వెళ్లిన కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులు రాష్ట్రానికి వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం సమకూరుస్తున్నారని, వారి కోసం కేరళ తరహాలో గల్ఫ్ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, కార్మికులకు రాష్ట్రంలో అమలవుతున్న పథకాల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

మేడిపల్లి: రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీని షరతులు లేకుండా చేయాలని రెడ్డి సంఘం మేడిపల్లి మండల అధ్యక్షుడు సోముల నరసింహారెడ్డి కోరారు. మండలంలోని పోరుమల్లలో రైతులతో కలిసి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పట్టాపాసుబుక్ కలిగిన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రుణమాఫీపై ప్రభుత్వం విడుదల చేసిన జీవోతో రైతుల్లో అయోమయం నెలకొందని, దీంతో చాలామంది రైతులు రుణమాఫీకి దూరమవుతారని తెలిపారు. సురకంటి అంజిరెడ్డి, కందరి శ్రీధర్ రెడ్డి, కాలగిరి రాజేందర్, పెద్దిరెడ్డి ప్రణయ్, గుర్రాల శ్రీనివాస్, పెద్దిరెడ్డి లక్ష్మీనారాయణ, భేటి జలపతి తదితరులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో నైమిశారణ్యం పీఠాధిపతి



దుబ్బరాజన్న ఆలయంలో ప్రవచనాలు ఇస్తున్న పీఠాధిపతి బ్రహ్మనంద సరస్వతి

సారంగాపూర్: జిల్లాలో అతిపెద్ద శైవక్షేత్రంగా భాసిల్లుతున్న దుబ్బరాజన్న ఆలయంలో బుధవారం నైమిశారణ్యం పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి భక్తులకు దేవిభాగవత ప్రవచనాలు బోధించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఈవో కాంతారెడ్డి, భక్తులు పీఠాధిపతికి ఘనస్వాగతం పలికారు. పీఠాధిపతి స్వామివారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

33 సన్నాల్లో పొలాసవే 11 రకాలు



పొలాస శాస్త్రవేత్తలు రూపొందించిన జగిత్యాల వరి-3 రకం

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం 33 సన్నరకాల ధాన్యానికే బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెల్సిందే. అయితే అందులో 11 రకాల ధాన్యం జిల్లాలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం రూపొందించినవే ఉండడం గమనార్హం. అలాగే పెద్దపల్లి జిల్లాలోని కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం రూపొందించిన రెండు రకాలు ఉన్నాయి. పొలాస పరిశోధన స్థానం నుంచి ఎంపికైన 11 రకాల్లో జగిత్యాల వరి-3 (జేజీఎల్-27356), జగిత్యాల వరి-2 (జేజీఎల్-28545), జగిత్యాల మసూరి (జేజీఎల్-11470), పొలాస ప్రభ (జేజీఎల్-384), మానేరు సోనా (జేజీఎల్-3828), జగిత్యాల సన్నాలు(జేజీఎల్-1798), జగిత్యాల సాంబ (జేజీఎల్-3844), కరీంనగర్ సాంబ(జేజీఎల్-3855), అంజన (జేజీఎల్-11118), ప్రద్యుమ్న (జేజీఎల్-17004), (జేజీఎల్-33124, విడుదలకు సిద్ధంగా ఉన్న రకం)లు ఉన్నాయి. అలాగే కూనారం పరిశోధన స్థానం నుంచి ఎంపికైన వాటిలో కూనారం వరి-2 (కేఎన్ఎం-1638), కూనారం వరి-1 (కేఎన్ఎం-733) రకాలు ఉన్నాయి.

పశు వైద్యశాఖలో సిబ్బంది కొరత

- మూగ జీవాలకు సకాలంలో అందని వైద్యం
- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



రెండేళ్లుగా ఇన్‌చార్జి వైద్యాధికారితో వెళ్లదీస్తున్న పెగడపల్లిలోని పశువైద్య కేంద్రం

పెగడపల్లి: జిల్లాలో మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. పశు వైద్యశాఖను సిబ్బంది, మందుల కొరత వేధిస్తోంది. పశువైద్యశాలల్లో కొన్నేళ్లుగా ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పోస్టుల భర్తీకి మోక్షం కలగాలని పాడి రైతులు ఎదురు చూస్తున్నారు. వైద్య సిబ్బంది కొరత కారణంగా మూగజీవాలకు సమయానికి వైద్యం అందడం లేదని ఆరోపిస్తున్నారు. జీవాలకు వైద్యం చేసే డాక్టర్లు కరువయ్యారు. రోగాల బారిన పడుతున్న పశువులకు అటెండర్లు, గోపాలమిత్రల వైద్యమే దిక్కవుతోందని రైతులు చెబుతున్నారు. వేలాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలి పశువులు మృతి చెందుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. జిల్లాలోని వివిధ మండలాల్లో పశువైద్యం, పశువుల పరిస్థితి, వ్యాధుల పరిస్థితి అధ్వానం మారుతోంది. ఏటా వర్షాల సమయంలో పశువులు, గొర్రెలు, మేకలు, ఇతర జంతువులు వ్యాధుల బారిన పడుతున్నాయి. పశువులకు జబ్బు చేసినప్పుడు తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యం అందడం లేదు. పశు వైద్యశాలల్లో సిబ్బందితోపాటు మందుల కొరత, ఆధునిక పరికరాలు లేకపోవడంతో మూగజీవాల పోషకులు ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు. అన్ని రోగాలకు తగినట్లు మందులు అందుబాటులో ఉండక పోవడంతో వైద్యులు చీటిరాస్తే ప్రైవేటుగా కొనుక్కోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

పశువైద్యశాఖ వివరాలు

ఏరియా వెటర్నరీ ఆస్పత్రులు	2
ప్రైమరీ వెటర్నరీ సెంటర్లు	31
సబ్ సెంటర్లు	45
ఖాళీలు ఇలా..	
డిప్యూటీ డైరెక్టర్	1
పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు	11
వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్లు	18
వెటర్నరీ అసిస్టెంట్లు	05
ఆఫీస్ సబార్డినేట్లు	12
పశువులు ఇలా..	
ఆవులు	30,901
గేదెలు	81,550
గొర్రెలు	6,10,985
మేకలు	97,035
కోళ్లు	23,24,868
ఇతరత్రా	3,310

వైద్యులను నియమించాలి



పెగడపల్లిలో రెండేళ్లుగా పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంటోంది. ఇన్‌చార్జి వైద్యుడున్నా.. సకాలంలో పశువులకు వైద్యసేవలు అందడం లేదు. పశువులు రోగాల బారిన పడితే గోపాల మిత్రులతో వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. పర్మినెంట్ పశువైద్యాధికారిని నియమించాలి.

– కదారి గంగయ్య పెగడపల్లి

మందుల కొరత లేకుండా చూడాలి



పశువైద్య కేంద్రం ఉన్నా.. పశువులకు రోగాలు వస్తే అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటలేవు. వైద్యుడు చీటి రాసిస్తే ప్రైవేట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. పశువుల వ్యాధుల నివారణకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి

– భైర రాజయ్య, పెగడపల్లి

ఇబ్బంది లేకుండా చర్యలు



పశు సంవర్ధక శాఖలో పలు కీలకమైన పోస్టులు ఖాళీగా ఉన్న మాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా 30 మంది డాక్టర్లకు 11పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యానికి ఇబ్బంది లేకుండా ఇన్‌చార్జి అధికారులను నియమించాం. వారు అందుబాటులో ఉంటున్నారు.

– వేణుగోపాల్‌రావు జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి

మొదటి విడత 39,253 మంది రైతులకు రుణమాఫీ

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు తీసుకున్న పంట రుణాలను రూ.2లక్షల లోపు మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెల్సిందే. ఈ మేరకు గురువారం సాయంత్రం వరకు రూ.లక్షలోపు రుణాలను మొదటి విడతగా రైతుల బ్యాంకు ఖాతాల్లో వేసేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో 1.32 లక్షల మంది రైతులు రూ.970 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం మొదటి దఫాలోనే దాదాపు రూ.400 కోట్ల వరకు మాఫీ అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో మొదటి దఫాగా 39,253 మంది రైతుల రుణాలు మాఫీ కానున్నాయి. మండలాల వారీగా రైతులను పరిశీలిస్తే బీర్‌పూర్‌లో 1,970మంది, బుగ్గారంలో 1,316, ధర్మపురిలో 3,065, ఎండపల్లిలో 2,184, గొల్లపల్లిలో 3,150, ఇబ్రహీంపట్నంలో 1,537, జగిత్యాల అర్బన్‌లో 399, జగిత్యాల రూరల్‌లో 2,478, కథలాపూర్‌లో 1,984, కొడిమ్యాలలో 2,110, కోరుట్లలో 1,727, మల్లాపూర్‌లో 1,708, మల్యాలలో 2,207, మేడిపల్లిలో 2,210, మెట్‌పల్లిలో 2,063, పెగడపల్లిలో 2,941, రాయికల్‌లో 2,831, సారంగాపూర్‌లో 1,236, వెల్గటూర్‌లో 2,142 మంది చొప్పున రైతులు అర్హులుగా ఉన్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


రాజ్‌కుమార్ (ఫైల్)

ధర్మారం: ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన కారపూరి రాజ్‌కుమార్(20) మద్యానికి బానిసై బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కారపూరి మొగిలి కొడుకు రాజ్‌కుమార్ మద్యం, సిగరేట్లకు బానిసయ్యాడు. ఆ అలవాట్లు మానుకోవాలని తండ్రి మొగిలి మందలించాడు. మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మొగిలి ఇచ్చిన ఫిర్యాదుతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన లక్క కొమురయ్య (85) అనే రిటైర్డ్ సింగరేణి కార్మికుడు బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మల్లేశ్ కథనం ప్రకారం.. సింగరేణి కార్మికుడిగా ఉద్యోగవిరమణ పొందిన కొమురయ్య భార్య ఇటీవల మరణించింది. అప్పటి నుంచి మానసిక వేదనకు గురవుతున్న కొమురయ్య ఉరేసుకుని చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మస్కట్‌లో వలసజీవి..


మాదాసు విజయ్ (ఫైల్)

వేములవాడరూరల్: ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ బాట పట్టిన యువకుడు అక్కడ కూడా పరిస్థితులు అనుకూలంగా లేక చేసిన అప్పులు తన గదిలోనే రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వేములవాడరూరల్ మండలం అచ్చన్నపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. అచ్చన్నపల్లికి మాదాసు విజయ్(27) ఏడాది క్రితం మస్కట్ వెళ్లాడు. అక్కడి కంపెనీలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, అప్పులు పెరగడంతో చేసేదేమి లేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి తండ్రి దేవయ్య, తల్లి మంజుల, అన్న, చెల్లె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన మడిపల్లి మొగిలయ్య(68) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మొగిలయ్య సొంత పనిమీద ఈ నెల 16న రాత్రి శ్రీరాములపేట గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా నరసింహులపల్లి గ్రామానికి చెందిన సమ్మయ్య ట్రాక్టర్‌తో వెనక నుంచి మొగిలయ్యను ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలైన మొగిలయ్యను హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఓసీపీలో అసువులుబాశారు

- ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో ప్రమాదం
- వర్షానికి తడిచిన నాలుగు మీటర్ల లోతు మట్టిలో పని
- కార్మికులపై మట్టికూలి ఇద్దరు మృతి.. మరో ఇద్దరికి గాయాలు
- కార్మిక క్షేత్రంలో పండగ పూట విషాదం
- రక్షణ చర్యల్లో వైఫల్యమే కారణం
- అధికారుల తీరుపై కార్మిక సంఘాల ఆగ్రహం


గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి భారీగా చేరుకున్న కార్మికులు

గోదావరిఖని: తొలిఏకాదశి పండుగ పూట విషాదం నెలకొంది. ఇద్దరు సింగరేణి కార్మికుల ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. డ్యూటీకి వెళ్లి వస్తామని చెప్పి ఇంట్లోంచి వెళ్లి ఓసీపీలో అసువులుబాశారు. రక్షణ చర్యల వైఫల్యంతోనే రెండు నిండుప్రాణాలు బలైపోయాయని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన మరమ్మతుకు సుమారు 4మీటర్ల మేరలోతు కందకాన్ని నిటారుగా తీయడంతోనే ప్రమాదం జరిగిందంటున్నారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు కార్మికులు స్వల్పంగా గాయపడ్డారు.

అసలేం జరిగింది..

సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–2 ప్రాజెక్టులో వర్షాకాలం కావడంతో క్వారీలోని నిలిచిన వరద నీటిని తరలించేందుకు భారీ మోటార్లను ఏర్పాటు చేశారు. సుమారు వంద మీటర్ల దూరం వరకు నిటారుగా పైపులైన్ వేశారు. 88రోడ్‌లెవల్ వద్ద హాలేజీ రోడ్డు కింద పైపులైన్ లీకేజీ ఏర్పడింది. దీన్ని సవరించేందుకు పొక్లెయిన్‌తో హాలేజీ రోడ్డును 4మీటర్లలోతు తవ్వి కందకం తీశారు. నాలుగురోజులుగా మరమ్మతు పనులు సాగుతున్నాయి. బుధవారం రెండోషిఫ్టులో ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు(58), జనరల్ మజ్దూర్ గాదె విద్యాసాగర్(50)తో పాటు సమ్మయ్య, శ్రీనివాస రాజు కందకంలో దిగి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్నారు. సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో ఒక్కసారిగా వీరిపై మట్టికుప్ప కూలింది. వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ మట్టిలో కూరుకుపోయారు. నిల్చున్న సమ్మయ్య, శ్రీనివాస రాజుపై కూడా మట్టిపడటంతో మోకాళ్ల లోతు వరకు కూరుపోయారు. అధికారులు ముందుగా మోకాళ్లలోతులో కూరుకపోయిన వారిని బయటకు తీశారు. పూర్తిగా మట్టిలో కూరుకపోయిన వారిని బయటకు తీసేందుకు సుమారు 25నిమిషాలుపట్టిందని


గాయపడిన కార్మికులను అంబులెన్స్‌లో తరలింపు

కార్మికులు చెబుతున్నారు. దీంతో శ్వాసఆడక ఇద్దరు మృతిచెందనట్లు డాక్టర్లు ప్రకటించారు. రక్షణ చర్యల్లో వైఫల్యంతోనే ప్రమాదం జరిగిందని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురిసిందని, తీసిన మట్టి లూజుగా మారి ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు. హాలేజీ రోడ్డుపై భారీ డంపర్లు నడుస్తుండటంతో ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి

ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు జనక్‌ప్రసాద్, మిర్యాల రాజిరెడ్డి, యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఇక్కడ పనివిధానం సరిగా లేదని ప్రమాదంలో మృతి చెందిన ఉప్పు వెంకటేశ్వర్లు చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్నారు.

డ్యూటీకి వెళ్లొస్తానని..

డ్యూటీకి వెళ్లివస్తామని చెప్పి కానరాని లోకాలు వెళ్లడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఉప్పు వెంకటేశ్వర్లు గతంలో ఇదే గనిలో టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీగా పనిచేసి అందరికి సుపరిచుడు. ఇప్పటివరకు వర్క్‌షాప్‌లో పనిచేయగా ఇటీవలేషిఫ్టుల్లోకి మార్చారు. వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌లు ఇద్దరు సెంటినరీకాలనీలో నివాసముంటున్నారు. ఊహించని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందడంతో వారి కుటుంబాలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలను మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సందర్శించారు.వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ మృతదేహాలు

సీఅండ్ఎండీ సీరియస్

ప్రమాదాన్ని సంస్థ సీఅండ్ఎండీ బలరాం సీరియస్‌గా తీసుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఫిట్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ విద్యాసాగర్ మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అమ్మా.. ఎంత పనిచేశావు..!

- క్షణికావేశంలో తల్లి ఆత్మహత్య
- ఏమైందో తెలియని వయసులో పిల్లలు
- రెండు కుటుంబాల్లో తీరని శోకం
- కన్నీరు పెట్టించిన చిన్నారుల తీరు


శ్రావణి (ఫైల్)

మేడిపల్లి: 'అమ్మా.. మమ్మల్ని ముద్దుగా పెంచావు. ఎంత అల్లరి చేసినా ఓపికగా భరించావు.. అందరితో ఆడుకుంటుంటే మురిసిపోయావు. మేమే నీ లోకం.. మేమే నీ సర్వస్వం అన్నట్లు మెదిలావు.. అంతలోనే మమ్మల్ని అనాథలను చేసి వెళ్లిపోయావా అమ్మా.. ఇక మాకు దిక్కెవరు.. మమ్మల్ని ఎవరు లాలిస్తారు.. ఎవరు బుజ్జగించి బువ్వ తినిపిస్తారు అమ్మా.. అనే రీతిలో ఆ చిన్నారులు తల్లి మృతదేహం వద్ద కనిపించిన తీరు కంటతడి పెట్టించింది. క్షణికావేశంలో ఆ తల్లి తీసుకున్న నిర్ణయం అటు పుట్టింట్లో.. ఇటు మెట్టింట్లో తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ విషాద ఘటన భీమారం మండలంలోని కమ్మరిపేటలో చోటుచేసుకుంది. కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామానికి చెందిన పాక లక్ష్మి, రాజం కూతురు శ్రావణిని కమ్మరిపేట గ్రామానికి చెందిన తిప్పిరి నరేశ్‌కిచ్చి ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు శ్రాహన్స్(4), రుద్రాన్స్ (ఏడాది) ఉన్నారు. నరేశ్ తనకున్న పొలంలో వ్యవసాయం చేస్తున్నాడు. శ్రావణి బీడీలు చుడుతోంది. ఉన్నంతలో హాయిగా ఉంటున్నారు. ఈ క్రమంలో శ్రాహన్స్‌కు ఐదు రోజులుగా జ్వరం వస్తోంది. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లాలని నరేశ్ శ్రావణికి చెబుతున్నాడు. తానే తీసుకెళ్లాలంటే ఎలా అని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రావణి మంగళవారం ఇంట్లోకి వెళ్లి క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను జగిత్యాల ఆస్పత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 'ఎంత పనిచేశావు బిడ్డా.. నీ పిల్లలు పసిమొగ్గలని గుర్తుకురాలేదా.. ఆ యముడే మదిలో నుంచి జ్ఞాపకాలు తీసేసాడా.. అంటూ గుండెలవిసేలా రోదించారు. విగతజీవిగా మారిన భార్య మృతదేహాన్ని చూస్తూ భర్త నరేశ్.. అమ్మకు ఏమైంది నాన్న అంటూ నాలుగేళ్ల కొడుకు.. ఏం జరుగుతుందో తెలియక బోసిపోయిన ముఖంతో ఏడాది కుమారుడు.. మీ అమ్మ ఇకరాదు బిడ్డా అని ఎలా చెప్పాలో తెలియక బరువెక్కిన హృదయంతో దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు శ్రావణి తల్లిదండ్రులు. అప్పటి వరకు అందరితో కలివిడిగా ఉన్న శ్రావణి క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం తన ఇద్దరు పిల్లలతోపాటు కుటుంబ సభ్యులకు కడుపు కోతను మిగిల్చింది. పెద్ద కుమారుడితో శ్రావణికి తలకొరివి పెట్టించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

రాజన్న సన్నిధిలో సంగీత విభావరి


రాజన్న సన్నిధిలో సంగీత విభావరిలో స్థానిక కళాకారులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను పురస్కరించుకుని ఆలయ అధికారులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రంతా భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తిరిగి ఉదయం వరకు అఖండ భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కళాకారులతోపాటు ధర్మపురి కళాకారుల శాస్త్రీయ సంగీతం, మంటప హనుమాన్ దేవస్థానికి చెందిన కళాకారుల భజన, సిరిసిల్ల భజన మండలి, హరికథాగానం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కళాకారులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో కొప్పుల వినోద్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అభినందించారు.

ఆర్థికసాయం అందజేత


చొప్పదండి: ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య జూన్ 28న సౌదీ అరేబియాలో మృతి చెందగా స్వగ్రామానికి మృతదేహం తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. జీవనోపాధికి గల్ఫ్ వెళ్లిన అంజయ్య గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం రాత్రి అంజయ్య మృతదేహం స్వగ్రామానికి రానుండగా మేడిపల్లి రూపాదేవి ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ.ఐదు వేలు కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు. కార్యక్రమంలో మునిగాల చందు గౌడ్, నరేశ్‌గౌడ్, కళ్లెం దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న అతివేగం

- బంజేరుపల్లి రోడ్డుప్రమాదంతో రెండు కుటుంబాల్లో విషాదం
- మృతులిద్దరిదీ పేద కుటుంబాలే..


మహేశ్(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): అతివేగం ప్రాణాలమీదికి వస్తోంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజేరుపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంతో రెండు కుటుంబా ల్లో విషాదం నింపింది. బొలేరో డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం లోడ్‌తో అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం ఎదురుగా వెళ్లే ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో చీకట్ల మహేశ్(30), సోమిడి అభిషేక్(22) మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొలేరో డ్రైవర్ సహా మరో ఇద్దరు పరారయ్యారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

ఆ కుటుంబాలకు దిక్కెవరు?

మృతుల్లో చీకట్ల మహేశ్‌కు అయిదేళ్ల కిందట కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం రంగపేటకు చెందిన కావ్యతో పెళ్లయింది. వీరికి రెండేళ్ల కూతురు సిరిచందన, నాలుగు నెలల పాప


బొలేరో ఢీకొట్టడంతో ధ్వంసమైన ట్రాక్టర్ ఇంజిన్ హౌసింగ్

ఉన్నారు. మహేశ్ తల్లిదండ్రులు లక్ష్మి–ఎల్లయ్య కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మహేశ్ తో పాటు ఇద్దరు కూతుళ్లు. ట్రాక్టరు డ్రైవర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే అతడు మృత్యువాత పడటంతో కుటుంబానికి దిక్కెవరని భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు కలిచివేసింది. ఇదే ప్రమాదంలో మృతి చెందిన సోమిడి అభి షేక్ నిరు పేద కుటుంబం. ఇంటర్ వరకు చదివిన అతడు కూలీ పనులకు వెళ్తున్నాడు.


అభిషేక్(ఫైల్)

అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు..

కొందరు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని రాత్రివేళ బొలేరోలో తరలిస్తున్నారు. బంజేరుపల్లి గ్రామ శివారులో అది ప్రమాదానికి గురవడంతో పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు వెలుగులోకి వచ్చింది. తెల్లవారు జామున సుమారు రెండున్నర గంటల ప్రాంతంలో ప్రమాదంజరిగింది. బొలేరో బోల్తాపడడంతో అందులోని పీడీఎస్ బియ్యం బస్తాలు రోడ్డుపై పడిపోయాయి.అటుగా వెళ్తున్న కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిళ్లు, ఆటోల్లో ఎత్తుకెళ్లారు.

హైనా దాడిలో లేగదూడ మృతి


లేగదూడ కళేబరం

దిగురుమామిడి: హైనాదాడిలో లేగదూడ మృతి చెందిందని మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు దేవునూరి వెంకటేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి పశువుల కొట్టంలో ఆవు, లేగదూడను దొడ్లో కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం కొట్టం వద్దకు వెళ్లగా లేగదూడ మృతిచెంది ఉంది. ముక్కు, మెడ భాగంలో దాడిచేయడంతో మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఠాణాలో యువకుడి ఆత్మహత్యాయత్నం

చందుర్తి(వేములవాడ): గంజాయి కేసులో నిందితుడిగా అనుమానిస్తున్న అదుపులోకి తీసుకున్న యువకుడు ఠాణాలోనే బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన తోట అఖిల్ వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసు నమోదైంది. అయితే కొన్ని రోజులుగా తప్పించుకు తిరుగుతున్నాడు. అఖిల్ చందుర్తి బస్టాండ్‌లోని ఓ టీస్టాల్‌లో టీ తాగుతున్నాడన్న సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక ఠాణాకు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న సమయంలోనే సదరు యువకుడు కాళ్లు, చేతిపై బ్లేడుతో కాట్లు పెట్టుకున్నాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి వేములవాడ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం ఏమి లేదని వైద్యులు చెప్పడంతో అదుపులోకి తీసుకున్నట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

పోలీసుల వేధింపులు భరించలేకనే..

పోలీసుల వేధింపులు భరించలేకనే బ్లేడుతో కాట్లు పెట్టుకున్నట్లు అఖిల్ వాపోయాడు. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చి చందుర్తిలోని ఓ కూల్‌డ్రింక్ డీలర్ వద్ద ఆటో నడుపుతున్నట్లు తెలిపాడు. చందుర్తిలో టీ తాగుతున్న సమయంలో ఓ కానిస్టేబుల్, డ్రైవర్ వచ్చి ఠాణాకు పట్టుకెళ్లారని, ఎందుకు తీసుకొచ్చారని అడగ్గా కూర్చోమని బెదిరించారన్నారు. తనను తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తనకు గంజాయితో ఎలాంటి లేదన్నాడు.

పరారీలో ఉన్న వ్యక్తి రిమాండ్

వేములవాడరూరల్: గంజాయి కేసులో గత ఆరు నెలలుగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రూరల్ మండల పరిధిలో గత జనవరి 31న గంజాయితో పట్టుబడ్డ చేపూరి సాయికుమార్, చిక్కుడు ప్రేమ్‌కుమార్, బాస రాజ్‌కుమార్, కేసరి రమేశ్‌లను విచారించగా అమీర్, కాల్వ వెంకటేశ్, పండుగ అభి, రవి వద్ద గంజాయి కొనుగోలు చేశామని తెలిపారు. ఆ నలుగురిని విచారించగా వారికి చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన తోట అఖిల్ గంజాయి సప్లయ్ చేసేవాడని తెలిపారు. గతంలో అందరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న అఖిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రిలే నిరాహారదీక్షకు పోలీసుల అనుమతి నిరాకరణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల గ్రామంలో నేరెళ్ల బాధితులు చేపట్టనున్న రిలే నిరాహారదీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని నేరెళ్ల బాధితుడు కోల హరీశ్ బుధవారం తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభించాల్సిన రిలే నిరాహార దీక్షలను మొహర్రం, తొలిఏకాదశి సందర్భంగా గురువారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే పోలీసులు అనుమతి నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. హైకోర్టు అనుమతితో త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

గుండెపోటుతో మాజీ ఉప సర్పంచ్ మృతి

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలకు చెందిన మాజీ ఉపసర్పంచ్ బద్దం మహిపాల్‌రెడ్డి (38) గుండెపోటుతో బుధవారం మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మహిపాల్‌రెడ్డి కాలికి గాయం కావడంతో కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అదే సమయంలో గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

పొలంలో పడి వ్యక్తి మృతి



గంగాధర్ (ఫైల్)

మల్యాల(చొప్పదండి): పొలంలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ముత్యంపేటలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్యాల గంగాధర్(40) బుధవారం కొంత మందితో కలిసి విందుభోజనానికి వెళ్లాడు. బహిర్భూమికని వెళ్లి నాటు వేసేందుకు సిద్ధం చేసిన పొలంలో పడ్డాడు. శ్వాస ఆడక అక్కడికక్కడే మృతిచెందాడు. సమీప రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నరేశ్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తల్వార్‌తో వీడియోలు.. వ్యక్తి రిమాండ్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక సంజీవయ్యనగర్‌కు చెందిన తోటచెర్ల సాయివర్ధన్ కొన్ని నెలలుగా తల్వార్, పెద్దకత్తితో విన్యాసాలు చేస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. మారణాయుధాలతో తీసిన వీడియోలను ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్టు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ఈవిషయం పోలీసుల దృష్టికొచ్చి ంది. ప్రజల శాంతియుత జీవనానికి భంగం కలిగించేలా రూపొందించిన వీడియోలు చిత్రీకరిస్తున్న సాయివర్ధన్‌పై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. బుధవారం అరెస్టు చేసి తల్వార్, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రి మాండ్‌కు తరలించినట్లు సిరిసిల్లపట్టణ సీఐ కృష్ణ తె లిపారు. ఆన్‌లైన్ రీల్స్, వీడియోల పేరుతో చట్ట వ్య తిరేక చర్యలకు పాల్పడిన వారికి నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్‌లోకి రూ.20 కాయిన్


సిరిసిల్ల మార్కెట్‌లోకి వచ్చిన రూ.20 కాయిన్

సిరిసిల్ల: మార్కెట్‌లోకి రూ.20 కాయిన్ వచ్చింది. ఇప్పటికే చిల్లర కొరత మార్కెట్‌ను వేధిస్తోంది. రూ.10 కాయిన్ చెల్లదంటూ తప్పుడు ప్రచారంతో చెలామణి నిలిచిపోయింది. రూ.10నోట్ల కొరత తీవ్రంగా ఏర్పడింది. తాజాగా రూ.20 నాణెం సిరిసిల్ల మార్కెట్‌లోకి వచ్చింది. సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులు వద్దకు రూ.20 నాణెం బుధవారం చేరింది. వీటి రాకతో మార్కెట్‌లో కొంతైనా చిల్లర సమస్య తీరుతుంది. మరోవైపు రూ.10 నాణేలు చెల్లవనే తప్పుడు ప్రచారంపై బ్యాంకర్లు, ఎల్‌డీఎం అధికారులు బహిరంగ ప్రకటన చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడు మృతి


నాగేశ్వర్‌గౌడ్ (ఫైల్)

జమ్మికుంట: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మాచర్ల నాగేశ్వర్‌గౌడ్(63) బుధవారం తాటిచెట్టు ఎక్కుతుండగా కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నాగేశ్వర్‌గౌడ్‌కు భార్య స్వరూప, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నాగేశ్వర్‌గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా అందించాలని మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్‌కుమార్, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు కొండపాక రమేశ్, నేరేళ్ల సదానందం, ఒల్లాల చిరంజీవి కోరారు.